క్లుప్తంగా

గేదెల మృతిపై వివరాల సేకరణ



పెద్దేవం పంచాయతీ వద్ద పాడి రైతులతో మాట్లాడుతున్న డీపీవో

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి, పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో మాట్లాడి గేదెలు మృతి చెందడానికి కారణాలు, ఎలా చనిపోయాయి అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. రైతులు ఈ వ్యాధి ఇంకా అదుపులోకి రాలేదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ , రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

నిడదవోలు: సమాజంలో నిరాధరణకు గురవుతున్న వృద్ధులను ఆదరించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో కాపు కల్యాణ మండపంలో బుధవారం వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 50 మంది వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కె.అచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో రక్తదాన శిబిరం

నల్లజర్ల: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా దూబచర్లలో లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంకు డాక్టర్లు రేష్మ, జి.జయలక్ష్మి, సిబ్బంది వచ్చి రక్తాన్ని సేకరించారు. యువకులు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిన శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్ సీమకుర్తి కిషోర్, భీమడోలు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి సత్యేంద్ర, తాతిన సత్యనారాయణ, సీమకుర్తి కృష్ణ ప్రసాద్, డాక్టరు కుమార్, యోగ మిత్ర రాజారావు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నిడదవోలు: కోరుకొండ మండలం మధుర పూడికి చెందిన దళిత యువకుడు పాము శ్రీనుపై కాపు సామాజికవర్గానికి చెందిన యువకులు నడిరోడ్డుపై స్తంభానికి కట్టేసి దాడి చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆధునిక సమాజంలో కుల దురహంకార దాడులు దళితులకు ఎటువంటి సంకేతాలు కూటమి ప్రభుత్వం ఇస్తుందో అర్థం చేసుకుని ప్రతిఘటన ఉద్యమాలు చేపట్టాలని రాంబాబు పిలుపునిచ్చారు. ఘటన జరిగిన వెంటనే కోరుకొండ పోలీసులు స్పందించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం అభినందనీయమన్నారు.

బాధ్యతతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుంది

చాగల్లు: విధి నిర్వహణలో బాధ్యతతో పనిచేస్తే మరింత గుర్తింపు లభిస్తుందని చాగల్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతి లభించడంతో వారిని చాగల్లు మండల రెవెన్యూ శాఖ సత్కరించింది. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భాను దుర్గప్రసాద్‌కు నల్లజర్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కమల్ దేవరపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సిబ్బంది వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కమల సుందర్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లిలో బుధవారం పలు కార్యక్రమాల్లో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో పలువురికి పెన్షన్లు ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం రూ.40 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరీ, కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ నాదేళ్ల శ్రీరామ్ చౌదరి, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ టర్నింగ్స్..!

- మలుపుల వద్దే ఎక్కువ ప్రమాదాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పెరవలి: మండలంలో ఉన్న రహదారులు అంతంత మాత్రంగా ఉన్నాయి. వీటిపై ఉన్న మలుపులు ప్రమాదానికి పిలుపులుగా మారాయి. ఈ రహదారులపై ఉన్న మలుపుల వద్ద జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మండలంలో 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి, 35 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారులు ఉన్నాయి. నిడదవోలు– నర్సాపురం రహదారిపై మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. ఈ రహదారి ఒక వైపున నర్సాపురం కాలువ, రెండో వైపున పంట భూములు ఉండటం వల్ల ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పెరవలి నుంచి కాకరపర్రు వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారిలో ఎనిమిది మలుపులు ఉండగా.. వీటిలో అత్యంత ప్రమాదకరంగా నాలుగు మలుపులు ఉన్నాయి. కాకరపర్రు వంతెన వద్ద మలుపు, పెరవలి ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో, జాతీయ రహదారిని కలిపే మలుపు, అజ్జరం వద్ద మలుపులు ఉన్నాయి.

రక్షణ చర్యలు ఏవీ?

గత పదేళ్లగా ఈ మలుపుల వద్ద 56 ప్రమాదాలు జరగగా.. 32 మంది క్షతగాత్రులు అయ్యారు. 22 మంది మృతి చెందారు. రెండేళ్ల క్రితం ఫిబ్రవరిలో పెరవలి జాతీయ రహదారి మలుపులో లారీ ఢీకొట్టడంతో ముగ్గురు చనిపోయారు. మే నెలలో లారీ సైకిలిస్టులను ఢీకొట్టగా ఒకరు చనిపోయారు. గతేదాది ఇదే ప్రాంతంలో ఆటో కాలువలోకి వెళ్లిపోవడంతో ఇద్దరు చనిపోయారు. మరో మలుపు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉండగా.. ఇక్కడ గతేడాది ఏడు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఎనిమిది మంది గాయపడగా.. ఇద్దరు చనిపోయారు. కాకరపర్రు వద్ద ఉన్న మలుపు వీటి అన్నింటి కన్నా ప్రమాదకరమైంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. ఇక్కడ రోడ్డుతో పాటు వంతెన కూడ వంపుగా ఉండటంతో వేగంగా వచ్చిన వాహనాలు అదుపుతప్పి కాలువలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడతారు. 8 ఏళ్ల క్రితం అరటి గెలల లోడుతో వస్తున్న లారీ ఈ మలుపులో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు మృతి చెందగా.. 12 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ముగ్గురు శాశ్వతంగా వికలాంగులుగా మారిపోయారు. ఇలా మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నా.. ఇరిగేషన్, పోలీసు శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. గతంలో ఈ మలుపుల వల్ల జరిగిన ప్రమాదాలు గురించి 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో ఆర్అండ్‌బీ అధికారులు సిమెంట్ పోల్స్‌ను కాలువ వైపు ఏర్పాటు చేశారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పెరవలి ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న మలుపు



ప్రమాదకరంగా కాకరపర్రు వంతెన మలుపు



పెరవలి జాతీయ రహదారిని కలిపే ప్రధాన మలుపు

వేగమే ప్రమాదాలకు కారణం



మండలంలో ఉన్న ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకు వేగంగా రావటం, వాహనాలు అదుపు తప్పడం కూడా ఓ కారణం. కనీసం ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో రోడ్డు ఉందన్న భ్రమలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి.

– కోటిపల్లి రాంబాబు ట్రాక్టర్ డ్రైయివర్ అన్నవరప్పాడు

అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు



రోడ్లలో ఉన్న మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా ఉన్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు కాలువలోకి లేక పంట పొలాల్లోకి వెళ్లిపోతున్నాయి. ఈ మలుపులను ఎవరూ పట్టించుకోవటం లేదు. ప్రమాదాలు ఆగటం లేదు.

– కుసుమే సూరిబాబు, ఖండవల్లి.

చాలా ప్రమాదకరంగా ఉన్నాయి



నిడదవోలు– నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు ఉన్నట్లు భావించిన వాహనదారులు హఠాత్తుగా మలుపు ఉండటంతో కాలువలో పడి వికలాంగులుగా లేక చనిపోవటం జరుగుతుంది.

– గొల్ల అర్జున్, తీపర్రు.

కూటమి పాలనలో కుదేలైన వ్యవసాయం

చాగల్లు: రాష్ట్రంలో కూటమి సర్కారు 15 నెలల పాలనలో వ్యవసాయ రంగం కుదేలైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అటకెక్కించి రైతులు పండించిన పంటలకు భద్రత లేకుండా చేశారని విమర్శించారు. చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ మూత పడటంతో ఈ ప్రాంత ప్రజలు అధికంగా వరిపై ఆధారపడ్డారన్నారు. వారికి సకాలంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఏడాదిగా ధాన్యం మొదలు టమాటా వరకు, మిర్చి నుంచి పొగాకు దాకా ఏ పంట చూసినా మార్కెట్లో గిట్టుబాటు ధర కాదు కదా.. కనీసం మద్దతు ధర కూడా దక్కక, పెట్టుబడి ఖర్చులు రాక అన్నదాతలు అల్లాడుతున్నారన్నారు.

15 నెలల్లో రూ.23,584 కోట్లు ఎగ్గొట్టారు

అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామంటూ సూపర్ సిక్స్‌లో చంద్రబాబు హామీ ఇచ్చారని, వాస్తవంగా ఏటా రూ.10,716 కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.21,432 కోట్లు జమ చేయాల్సి ఉండగా, తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం రెండో ఏడాది అరకొరగా విదిల్చిందని తలారి వెంకట్రావు ఆరోపించారు. ఇంకోవైపు కరవు ప్రభావంతో పంటలు దెబ్బతిన్న 3.91 లక్షల మంది రైతులకు రూ.328 కోట్ల బకాయిలు ఎగ్గొట్టారన్నారు. ఇలా ఏడాదిలో అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్ట పరిహారం, కరవు సాయం, సున్నా వడ్డీ రాయితీ బకాయిలు మొత్తం దాదాపు రూ.23,584 కోట్లకు పైగా చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆయన విమర్శించారు.



చాగల్లులో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

పథకాల అమలులో కూటమి వైఫల్యం

దేవరపల్లి: సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యమైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ విమర్శించారు. మండలంలోని కురుకూరులో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆచంట శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో కూచిపూడి సతీష్ పాల్గొని మాట్లాడారు. 15 నెలల కూటమి పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మహిళలకు ఆసరా, చేయూత, కాపు నేస్తం, సున్నా వడ్డీ వంటి పథకాలను అమలు చేసినట్టు చెప్పారు. వైద్య, ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యత ఇచ్చి కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి పేదోడి ఇంటికే వైద్యం తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను రద్దు చేసి మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకట సతీష్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు యంగళ ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు కరుటూరి నిత్యానందం, మాజీ సర్పంచ్ పల్లపు మోహన్‌రావు, పార్టీ నాయకులు గుత్తికొండ అచ్యుతరావు, చోడే గాంధీ, అయినపర్తి లక్ష్మణరావు, మల్లెల శ్రీనివాసరావు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కురుకూరులో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు సతీష్

కార్మికుల హక్కులు హరిస్తే పోరాటమే

నల్లజర్ల: రాష్ట్రంలో పెట్టుబడి దారి వ్యవస్థ కోసం కార్మికుల హక్కులు హరిస్తే పోరాటాలు తప్పవని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు అన్నారు. నల్లజర్లలో బుధవారం సాయంత్రం అంబేడ్కర్ భవన్‌లో మండల శాఖ అధ్యక్షుడు బొంగు వీరభద్రం అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల మహసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో కార్మికులు ఐక్యంగా కలసి రావాలని పిలుపు నిచ్చారు. కార్మిక వర్గాన్ని కులాలు, మతాల పేరుతో పాలకవర్గాలు చీలుస్తున్నాయని ఆరోపించారు. శ్రమకు తగ్గ వేతనం దక్కాలంటే పోరాటమే ఆయుధమన్నారు. జిల్లా కార్యదర్శి భగత్ మాట్లాడుతూ, ట్రంప్ భారతదేశ ఉత్పత్తులపై భారీగా పెంచిన సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయన్నారు. రిజర్వేషన్లు దెబ్బతీయడం కోసం దొడ్డి దారిలో చంద్రబాబు ప్రభుత్వ సంస్థల్ని ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు, పి.త్రిమూర్తులు, పి.కామేశ్వరావు, యం.రామలింగేశ్వరావు, స్కీమ్ వర్కర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దిని.. పాహిమాం..



తాళ్లపూడిలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు



మహిషాసుర మర్దినిగా దేవరపల్లి సౌభాగ్య దుర్గాంబిక



బ్రాహ్మణగూడెంలో ప్రత్యేక అలంకరణలో నాగారమ్మ



కోటసత్తెమ్మకి సారె తీసుకొస్తున్న లింగంపల్లి నీలాలమ్మ కమిటీ సభ్యులు

తాళ్లపూడి/దేవరపల్లి/నల్లజర్ల/నిడదవోలు రూరల్/చాగల్లు: దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. మహానవమి సందర్భంగా అమ్మవారి ఆలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. తాళ్లపూడిలోని నవదుర్గాధి పరివార శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి మహిషాసుర మర్దినీ అలంకారం చేశారు. అర్చకుడు సుబ్రమణ్య శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి సుప్రభాతసేవ, సహస్ర నామార్చన, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేగేశ్వరపురం మేదర పేటలో, మలకపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో, అన్నదేవరపేట, బల్లిపాడు, తాడిపూడి, గజ్జరం, పోచవరం, పెద్దేవం, పైడిమెట్ట గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరపల్లి మండలంలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు మహిళలు కుంకుమార్చన చేశారు. దేవరపల్లిలో మూడు బొమ్మల సెంటర్‌లోని సౌభాగ్య దుర్గాంబిక దేవి, బాలదుర్గమ్మ అమ్మవారు, పల్లపువీధి రామాలయం వద్ద ఉన్న కనకదుర్గాదేవి, శ్రీచక్ర సహిత విజయదుర్గాదేవి అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమివ్వనున్నారు.

నల్లజర్ల మండలంలోని అనంతపల్లి శివారు సంజీవపురంలోని స్వర్ణదుర్గాశ్రమంలో బుధవారం శమీపూజ చేశారు. అమ్మవారికి మహిషాసుర మర్దిని అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. త్యాజంపూడికి చెందిన కోదండ రామ భజన మండలి ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన చేశారు. పోతవరం జమ్మి చెట్టు వద్ద ఉన్న కామాక్షి ఆలయం వద్ద, చావావారి వీధిలో ఉన్న విజయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లజర్ల వనదుర్గా ఆలయంలో, దూబచర్ల, తూర్పుచోడవరం, ఆవపాడు, ప్రకాశరావుపాలెంలో ప్రత్యేక పూజలు చేశారు.

నిడదవోలు మండలంలో దేవి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చివరి రోజు భక్తులకు విజయదుర్గగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మను పదో రోజు బుధవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 418 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి లింగంపల్లి నీలాలమ్మ దుర్గమ్మ కమిటీ సభ్యులు సారె సమర్పించినట్లు ఆలయ ఈఓ హరి సూర్యప్రకాష్ తెలిపారు.

చాగల్లులో మాతంగి చెరువు గట్టుపై ఉన్న అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ధనలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ అమ్మ వారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. ఊనగట్ల, ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల్లోని ఆలయాల్లో కూడా పూజలు చేశారు. పలు చోట్ల ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణా సుజుకీలో దసరా ధమాకా

ఏలూరు టౌన్: ఏలూరులోని శ్రీకృష్ణా సుజుకీ షోరూమ్‌లో దసరా వేడుకల నేపథ్యంలో సందడి వాతావరణం నెలకొంది. మోటారు సైకిళ్లు, స్కూటీలు కొనుగోళ్లపై భారీ ఆఫర్లు ఇస్తుండటంతో వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఒకవైపు జీఎస్‌టీ తగ్గింపు, మరోవైపు శ్రీకృష్ణా సుజుకీ యాజమాన్యం నారా శేషు ఆఫర్లు ప్రకటించటంతో కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త వాహనాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సమేతంగా షోరూమ్‌కు వెళ్లి మరీ ధరలపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం సుజుకీ వాహనం కొనుగోళ్లపై సుమారు రూ.15 వేల వరకూ జీఎస్‌టీ ఆదా అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. వీటితో పాటు క్యాష్ బ్యాక్ ఆఫర్లు కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రతి సుజుకీ యాక్సెస్ కొనుగోలుపై రూ.3 వేలు, అవినీస్ కొనుగోలుపై రూ.5 వేలు క్యాష్‌బ్యాక్ ఆఫర్ వర్తిస్తుందన్నారు. ప్రతి మోటారు సైకిల్ కొనుగోలుపై ఏకంగా రూ.20 వేల క్యాష్‌బ్యాక్ ఇస్తుండగా, డౌన్ పేమెంట్ సైతం కేవలం రూ.5,999 మాత్రమే ఉందని యజమాని శేషు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, కొవ్వూరులోని తమ షోరూమ్స్‌లో ఆఫర్లు కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.



ఏలూరులోని సుజుకీ షోరూమ్‌లో దసరా సందడి

విజయదశమీ

- జమ్మి పత్రాలతో స్నేహం వృద్ధి
- దశమి రోజున చెట్టుకు ప్రత్యేక పూజలు

తాళ్లపూడి: శమీ వృక్షానికి విజయదశమి పండుగకు మధ్య సన్నిహిత సంబంధం. శమీ వృక్షం అంటే జమ్మి చెట్టు. సర్వపాప నివారిణి, పావనమైనదిగా జమ్మి చెట్టుకు ప్రత్యేక స్థానం ఉంది. హిందూ సాంప్రదాయంలో జమ్మిచెట్టుకు ప్రత్యేక స్థానం ఉంది. వివాహల సమయంలో వీరన్నబాబు బోనం పోసుకునే వారు జమ్మి చెట్టుకు పూజలు నిర్వహిస్తారు. మండలంలో పలు ప్రాంతాల్లో ఉన్న జమ్మి చెట్లు నిత్యం పూజలు అందుకుంటున్నాయి. దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా విజయదశమి రోజున జమ్మి చెట్టుకు ప్రత్యేకంగా పూజలు చేస్తారు. విద్యార్థులు తమ కోరికలను కాగితంలో చీటీలపై రాసి చెట్టుపై ఉంచుతారు. నేడు విజయదశమి సందర్భంగా దశమి విశిష్టతను తాళ్లపూడికి చెందిన టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు పరస రాధాకృష్ణ వివరించారు.

ఉత్తర గోగ్రహణంలో పాండవుల విజయం

దశమి రోజున సాధకుని పూజలు ఫలించి సంపూర్ణ సిద్ధి కలిగిందని, అదే విధంగా దుర్గమ్మ మహిషాసురుడ్ని వధించి విజయాన్ని పొందిన రోజు కాబట్టి ఎంతో ప్రాధాన్యం ఉంది. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లే ముందు తమ ఆయుధాలన్నింటిని జమ్మి చెట్టుపైనే ఉంచుతారు. అజ్ఞాతవాసం పూర్తైన తర్వాత శమీ వృక్షాన్ని పూజించి ఆయుధాలను తీసుకొని అర్జునుడు ఉత్తర గోగ్రహణంలో విజయం సాధించాడు. శ్రీరాముడు అరణ్యవాసం చేసే సమయంలో శమీ వృక్షం కింద విశ్రాంతి తీసుకున్నారు. అందుకే ఈ వృక్షాన్ని ఎంతో పావనమైనదిగా భావిస్తారు. త్రేతాయుగంలో ఆశ్వయుజ శుద్ధ దశమి నాడు ఆదిపరాశక్తిని జమ్మి ఆకులతో పూజించి రాముడు రావణుడితో యుద్ధం చేసి విజయం సాధించాడని దేవి భాగవతం చెబుతుంది.

దోషాలను హరించే శక్తి

నవగ్రహాల ద్వారా మానవుడికి కలిగే వివిధ రకాల దోషాలను హరించే శక్తి శమీ వృక్షానికి ఉంది. ఈ వృక్షం చుట్టూ ప్రదక్షిణాలు చేసినా, చేతితో తాకినా, పూజించినా సర్వ దోషాలు నివారించబడతాయన్నారు. దశమి రోజున జమ్మి చెట్టు ఆకులను స్నేహితులకు ఇచ్చే సంప్రదాయం చాలా ప్రాంతాల్లో ఉంది. దశమి రోజున ఆలయాల్లో జమ్మి చెట్టుకు పూజలు జరిపి తమ గోత్రనామాలతో రాసిన చీటీలను వృక్షంపై పెడితే భగవంతుడి కృప ఉంటుంది. ''శమీ చమయితే పాపం, శమీ శత్రు వినాశిని అర్జునస్య ధనుర్ధారి, రామస్య ప్రియదర్శిని'' అనే శ్లోకాన్ని పఠిస్తూ వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేయడం ద్వారా నవరాత్ర పూజాఫలం లభిస్తుందని ఆయన తెలిపారు.

ఎన్నో ఆయుర్వేద గుణాలు

శమీ చెట్టుకు ఆయుర్వేదంలో కూడా చాలా ప్రాధాన్యత ఉంది. ఈ చెట్టు ఆకులు, బెరడుల కషాయాన్ని నోట్లో వేసుకుని పుక్కిలిస్తే నోటి దుర్వాసన, దంత సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆయన అన్నారు. ఐరన్, జింక్, మెగ్నీషియం ఉన్నాయి. శమీ చెట్టు వేళ్ల నైట్రోజన్‌ను సేకరించి భూసారాన్ని వృద్ధి చేస్తాయి.



తాళ్లపూడిలో ఉన్న జమ్మిచెట్టు



పరస రాధాకృష్ణ